సాక్షి
ఖమ్మం
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



అంగన్‌వాడీలకు కాస్త ఊరట!
అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల కోసం నూతన పాలసీని రూపొందించగా.. కొన్ని అంశాల్లో సాయం పెంచాలని కోరుతున్నారు. 8లో



నిత్యాన్నదానానికి విరాళం
విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి ఖమ్మంకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళం అందజేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం
కొన్నిచోట్ల ఆదివారం ఉదయం వర్షం కురిసే సూచనలు ఉన్నాయి. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

రైతు గోస.. బీజేపీ భరోసా

బీజేపీ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో ఖమ్మం నగరం నిండిపోయింది. 'రైతు గోస.. బీజేపీ భరోసా' పేరుతో ఆదివారం నిర్వహిస్తున్న బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి, పార్టీ అగ్రనేత అమిత్‌షా హాజరుకానుండడంతో నగరం ముస్తాబైంది. ఇక సభ జరిగే ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. విశాలమైన సభా వేదిక, గ్యాలరీలు, బారికేడ్ల నిర్మాణం పూర్తయింది. బీజేపీ రాష్ట్ర నాయకులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. గోవా తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు జిల్లాలో వారం రోజులుగా విస్తృతంగా పర్యటించారు. వీరితో పాటు స్థానిక నాయకత్వం జన సమీకరణపై దృష్టి పెట్టింది. కేంద్ర ఎస్‌పీజీ, సీఆర్‌పీఎఫ్ దళాలు కూడా ఖమ్మం చేరుకుని బందోబస్తును పరిశీలించాయి. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

నేడు ఖమ్మంలో బీజేపీ సభ
- పాల్గొననున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో పూర్తయిన ఏర్పాట్లు
- సభకు లక్ష మందిని తరలించే సన్నాహాల్లో పార్టీ శ్రేణులు
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీఆర్‌పీఎఫ్ అధికారులు





సభా మైదానంలో సిద్ధమైన వేదిక (ఇన్‌సెట్) మైదానంలో ఏర్పాటుచేసిన కటౌట్లు



ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ మైదానంలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్, సీఆర్‌పీఎఫ్ అధికారులు

వారం రోజుల నుంచి..
బీజేపీ బహిరంగ సభ కోసం వారం రోజులుగా చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 18న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఖమ్మం వచ్చి ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానాన్ని పరిశీలించి ఏర్పాట్లు, జన సమీకరణపై దిశానిర్దేశం చేశారు. గతంలోనూ రెండుసార్లు అమిత్‌షా వస్తారని ప్రకటించినా వాయిదా పడటంతో ఈసారి ఏర్పాట్లు కొంత మందకొడిగా సాగాయి. మూడు రోజుల క్రితం అమిత్‌షా టూర్ షెడ్యూల్ విడుదల కావడంతో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శుక్రవారం బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఖమ్మం వచ్చి పరిశీలించి సభ విజయవంతం కోసం తీసుకోవాల్సిన చర్యలను నేతలకు సూచించారు.

నగరం ముస్తాబు
నగరం మొత్తం బీజేపీ జెండాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లతో పాటు డివైడర్ల పొడవునా పార్టీ తోరణాలు కట్టారు. అలాగే, కూడళ్ల వద్ద కూడా అమిత్‌షాకు స్వాగతం పలుకుతూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. సభా ప్రాంగణం నలువైపులా ఫ్లెక్సీలు వెలిశాయి. ఇక సభకు వచ్చిన ప్రజలు కూర్చునేలా గ్యాలరీలు ఏర్పాటు చేసి తొక్కిసలాట జరగకుండా ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటుచేశారు.

జన సమీకరణపై దృష్టి
సభకు లక్ష మందికి తగ్గకుండా తరలించడంపై బీజేపీ నేతలు దృష్టి సారించారు. కొద్ది సమయమే ఉన్నా ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గోవా ఎమ్మెల్యే ప్రేమేంద్రసేథ్ తదితరులు అమిత్‌షా సభ ఖరారైనప్పటి నుంచి జిల్లాలో పర్యటిస్తూ జన సమీకరణపై సూచనలు చేశారు. రైతుల సంక్షేమం కోసం చేపట్టే చర్యలను అమిత్‌షా ప్రకటిస్తారని ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ప్రకటించిన నేపథ్యాన రైతులను అధిక సంఖ్యలో సమీకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జనాన్ని తరలించేందుకు ఇప్పటికే వెయ్యి బస్సులను బుక్ చేసిన పార్టీ నేతలు.. అదే స్థాయిలో ప్రైవేట్ వాహనాలను కూడా సమకూరుస్తున్నారు. కాగా, వాహనాల పార్కింగ్ కోసం 11 పాయింట్లు గుర్తించారు.

సభ తర్వాత కోర్ కమిటీ భేటీ
అమిత్‌షా ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించిన అనంతరం వేదిక వెనుకాల గ్రీన్‌రూమ్‌లో రాష్ట్రస్థాయి కోర్ కమిటీ భేటీలో పాల్గొంటారని తెలుస్తోంది. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ కమిటీకి దిశానిర్దేశం చేయనున్నారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 23 మంది ముఖ్యనేతలు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిసింది. 'రైతు గోస.. బీజేపీ భరోసా' పేరుతో వేదికపై భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా, 80 మంది కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి తోపాటు ముఖ్యనేతలు బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డాక్టర్ లక్ష్మణ్, గరికపాటి మోహన్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు వేదికపై కూర్చుంటారు.

అధికారిక ఏర్పాట్లు పూర్తి
కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనకు సంబంధించి అధికారిక ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ధరమ్‌వీర్ జాకర్.. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులతో బందోబస్తు, ఏర్పాట్లపై శనివారం స్టేడియంలో సమీక్షించారు. బందోబస్తుపై సూచనలు చేయడమే కాక వైద్యులు, అన్ని సదుపాయాలతో అంబులెన్స్, ఫైరింజన్, కావాల్సిన వాహనాలను సమకూర్చాలని తెలిపారు. ఎక్కడా ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ సమీక్షలో ఇంటెలిజెన్స్, పోలీసు, సీఆర్‌పీఎఫ్ అధికారులతో పాటు అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అదనపు డీసీపీ ఏ.సీ.బోస్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేందర్, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, డీటీఓ కిషన్‌రావు, ఆర్డీఓ జి.గణేష్ పాల్గొన్నారు.

రంగంలోకి సీఆర్‌పీఎఫ్..
కేంద్ర హోంమంత్రి హోదాలో బీజేపీ అగ్రనేత అమిత్‌షా జిల్లాకు వస్తుండటంతో సీఆర్‌పీఎఫ్ అధికారులు రంగంలోకి దిగారు. బీఎస్‌ఎఫ్ హెలికాప్టర్ ద్వారా శనివారం ఉదయం ట్రయల్ రన్ నిర్వహించారు. కేంద్ర హోం మంత్రి జిల్లాకు వస్తుండటం ఇదే ప్రథమం. దీంతో సీఆర్‌పీఎఫ్‌లో ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వాన 50 మంది వరకు బలగాలు ఖమ్మం చేరుకున్నాయి. అమిత్‌షా హెలికాప్టర్ దిగిన దగ్గరి నుంచి తిరిగి వెళ్లే వరకు వీరిలో 19 మంది అధికారులు ఆయన భద్రతను పర్యవేక్షిస్తారు. ఇందులో ఒక కమాండెంట్, ఇద్దరు డిప్యూటీ కమాండెంట్లు, ఒక ఆర్‌ఐ, ఒక ఆర్‌ఎస్సై, 14 మంది పీసీలు ఉంటారు. ఇక ఖమ్మం కమిషనరేట్ నుంచి ఇద్దరు అడిషనల్ డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, సీఐలు, ఎస్‌ఐలు, ఇతర సిబ్బందితో పాటు రోప్ పార్టీ, డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్‌లు బందోబస్తులో పాల్గొననున్నాయి.

నేటి అమిత్‌షా పర్యటన షెడ్యూల్ ఇలా...
- **మధ్యాహ్నం 12.25 గంటలు :** ఢిల్లీ నుంచి ఐఏఎఫ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో బయలుదేరతారు.
- **2.50 గంటలు :** విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు.
- **2.55 గంటలు :** విజయవాడ నుంచి బీఎస్‌ఎఫ్ హెలికాప్టర్‌లో బయలుదేరి 3.25 గంటలకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంకు వస్తారు.
- **సాయంత్రం 3.30 గంటలు :** హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో 3.40 గంటలకు ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలోని సభావేదికపైకి చేరుకుంటారు.
- **3.45 నుంచి 4.35 గంటల వరకు :** బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- **సాయంత్రం 4.40 నుంచి 5.30 గంటల వరకు :** ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానం ఆవరణలో బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.
- **5.35 గంటలు :** రోడ్డుమార్గంలో హెలిప్యాడ్‌కు వద్దకు చేరుకుని విజయవాడకు, అక్కడి నుంచి ఢిల్లీ బయలుదేరతారు.

న్యూస్‌రీల్

జమలాపురంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ఆరంభించారు. తొలుత శ్రీవారికి నిత్య పూజలు నిర్వహించాక, ఉత్సవమూర్తులు కొలువైన యాగశాలలోకి పవిత్రాలను తీసుకొచ్చారు. అనంతరం పుణ్యాహవచనం, ఋత్విక్కరణం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ చేసి కలశస్థాపన చేశాక పవిత్రాలకు అధివాసాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె జగన్మోహన్ రావు, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ తదితరులు పాల్గొన్నారు.

డీఏఓగా సరితకు అదనపు బాధ్యతలు



బి.సరిత

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం టెక్నికల్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) బి.సరితకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనిర్మల ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 30 వరకు సెలవులో వెళ్లారు. ఆమె డీఏఓగానే కాకుండా ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం ఉపసంచాలకులుగా, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో డీఏఓ బాధ్యతలను సరితకు, రైతు శిక్షణ కేంద్రం ఉపసంచాలకులు, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలను రైతు శిక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సతీష్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

28 నుంచి 'దోస్త్' ప్రత్యేక ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు 'దోస్త్' ద్వారా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ఈమేరకు డ్రైవ్ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 4వ తేదీ వరకు రూ.400ఫీజుతో రిజిస్ట్రేషన్ చేసుకుని, వచ్చే నెల 5లోగా ఆప్షన్లు ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే, సెల్ఫ్ రిపోర్టింగ్ వచ్చే నెల 10నుంచి 15వ తేదీ వరకు కొనసాగుతుందని వారు తెలిపారు.

'నవోదయ' ప్రవేశ దరఖాస్తు గడువు పెంపు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే, దరఖాస్తు గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మెడికల్ కళాశాలలో 90 సీట్లు భర్తీ



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీ చకచకా జరిగిపోతోంది. నాలుగు రోజుల్లోనే 90 సీట్లు భర్తీ అయ్యాయి. ఈనెల 22న కళాశాలలో తొలి విద్యార్థి చేరగా కౌన్సెలింగ్ పూర్తయిన శనివారం నాటికి 90 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. మరో రెండు విడతల కౌన్సెలింగ్ ఉండడంతో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కానున్నాయి. కాగా, కళాశాలకు కేటాయించిన 100 సీట్లలో రాష్ట్ర కోటా 78 సీట్లకు గాను 77 సీట్లు భర్తీ అయ్యాయి. మరో సీట్ భర్తీ కావాల్సి ఉండగా, ఇంకా రిజర్వేషన్ కేటగిరీలో ఏడు సీట్లకు అనుమతి రావాల్సి ఉంది. అలాగే, జాతీయ కోటాలో 15 సీట్లకు గాను 13 భర్తీ అయ్యాయి.

మొక్కలతో భావితరాలకు మేలు

- ప్రతీఒక్కరు హరితహారంలో భాగం కావాలి
- 'వృక్షార్చన'లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- పలు ప్రాంతాల్లో మొక్కలు నాటిన కలెక్టర్, ఎమ్మెల్సీ, సీపీ



ఖమ్మం వెలుగుమట్ల పార్కులో మొక్క నాటుతున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్సీ మధు, సీపీ వారియర్ తదితరులు

ఖమ్మంఅర్బన్: భావితరాలు ఆహ్లాదకరమైన జీవన విధానాన్ని పొందాలంటే మొక్కలు నాటితేనే సాధ్యమవుతుందని.. ఈ విషయాన్ని గుర్తించి అందరూ హరితహారంలో భాగం కావాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ సూచించారు. కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం ఖమ్మం వెలుగుమట్లలోని అర్బన్ పార్క్, కైకొండాయిగూడెం పారిశ్రామిక ప్రాంతంలో సీపీ విష్ణు ఎస్.వారియర్, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఒకేరోజు రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటుతుండగా, జిల్లాలో 5.60 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొక్కలు నాటడం, సంరక్షణను అధికారులతో పాటు స్థానికులు బాధ్యతగా భావించాలని సూచించారు. తద్వారా మంచి వాతావరణం రూపుదిద్దుకుంటుందని చెప్పారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను రక్షించి పచ్చదనం పెంపొందించడానికి ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మంచి జీవన విధానం అందేలా కృషి చేయాలని సూచించారు.

రహదారుల వెంట మొక్కలు నాటాలి
ముదిగొండ: రహదారుల వెంట మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ముదిగొండ మండలం వెంకటాపురంలోని ఓ వెంచర్‌లో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. కాగా, వెంచర్ నుంచి గ్రామపంచాయతీకి రిజిస్ట్రేషన్ చేసిన భూమిలో ఎన్ని మొక్కలు నాటారు, ఎక్కడి నుంచి తీసుకొచ్చారని ఆరా తీయగా జీపీ నుంచి సమకూర్చామని డీఆర్‌డీఓ విద్యాచందన బదులిచ్చారు. అయితే, మొక్కలు తీసుకువచ్చే బాధ్యత వెంచర్ యజమానులదేనని స్పష్టం చేశారు. రహదారుల వెంట, వెంచర్లలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

అందరికీ బాధ్యత
ఖమ్మంరూరల్: ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా అందరికీ స్వచ్ఛమైన గాలి అందేందుకు మొక్కలు నాటడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడులోని గ్రానైట్ ఫ్యాక్టరీలో ఆయన ఎమ్మెల్సీ మధుతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్, ఎఫ్‌ఆర్‌ఓలు రాధిక, వేణుమాధవ్, కార్పొరేటర్ రావూరి కరుణసైదబాబు, డీఎల్‌పీఓ పుల్లారావు, ఎంపీపీలు సామినేని హరిప్రసాద్, బెల్లం ఉమ, ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ రామారావు, ఎంపీఓ సూర్యనారాయణ, సర్పంచ్ అనంత రాములు, గ్రానైట్ ఫ్యాక్టరీ బాధ్యులు సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా ప్రయాణం పూర్తయింది..

వైరా ఎమ్మెల్యే రాములునాయక్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: 'నా ప్రయాణం పూర్తయింది. మీ హృదయాల్లో నాకు మంచి మార్కులే వేశారని అనుకుంటున్నా.. ప్రతిఒక్కరు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఆయన్ను మూడోసారి ముఖ్యమంత్రి చేసేలా కష్టపడదాం, ఎవరూ కక్షసాధింపు చర్యలకు పాల్పడొద్దు' అని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ సూచించారు. కోటి వృక్షార్చనలో భాగంగా కారేపల్లిలోని మోడల్ స్కూల్‌లో శనివారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం బీఆర్‌ఎస్ కార్యాలయంలో పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కారేపల్లిలోనే ఎస్‌ఐగా విధులు నిర్వర్తించి ఇక్కడే ఉద్యోగ విరమణ చేశానని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన తనను కారేపల్లి వాసులు అక్కున చేర్చుకుని గెలిపించారని తెలిపారు. ఈసారి అవకాశం రాకున్నా, కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూడాలనే లక్ష్యంతో అందరూ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు శకుంతల, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్దబోయిన ఉమాశంకర్, ఇస్లావత్ బన్సీలాల్, ముత్యాల సత్యనారాయణ, అడ్డగోడ ఐలయ్య, అజ్మీర వీరన్న, ధరావత్ మంగీలాల్, బాణోతు కుమార్, కిషోర్, పిల్లి వెంకటేశ్వర్లు, గౌస్ పాషా, పాండ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో జరిగింది రాజ్యహింసే...

- అక్కడి ప్రజలను చీల్చేందుకు బీజేపీ యత్నం
- ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జాతీయ ప్రధాన కార్యదర్శి అనీరాజా



సదస్సులో మాట్లాడుతున్న అనీ రాజా, వేదికపై కిమ్‌కోవా తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మణిపూర్‌ను చీల్చే కుట్రలో భాగంగానే హింస ప్రేరేపితమైందని.. అక్కడ హింస తెగల మధ్య జరగలేదని.. రాజ్య హింసను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రేరేపించాయని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జాతీయ ప్రధాన కార్యదర్శి అనీరాజా తెలిపారు. ప్రత్యామ్నాయ పౌర సమాజం ఆధ్వర్యాన ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం 'మణిపూర్ మంటలు' అంశంపై సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో అనీరాజా మాట్లాడుతూ మణిపూర్‌లో హింసకు ప్రభుత్వం చెబుతున్నట్లుగా జాతుల మధ్య వైరం కారణం కాదని చెప్పారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ బృందం అక్కడ పర్యటించి ఆస్పత్రులు, ఘటనాస్థలాలను పరిశీలించి బాధితులతో మాట్లాడామని తెలిపారు. కుకీలకు చెందిన విద్యార్థులు కొండ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ఆందోళన చేయడంతో పాటు నిధుల్లో 85 శాతం మైతేయి తెగలు నివసిస్తున్న ప్రాంతాల్లో ఖర్చు చేయడాన్ని తప్పుపట్టారని పేర్కొన్నారు. నిరసన అనంతరం వారు చాందన్‌పూర్‌కు వెళ్తుండగా సంఘ్‌పరివార్ శక్తుల రూపంలోదాడి చేశారని తెలిపారు. మూడు రోజుల పాటు నిరంతరంగా దాడులు, అత్యాచారాలు, అమానవీయ ఘటనలు జరిగినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మారణ హోమాలకు సంఘ్ పరివార్ శక్తులే కారణమని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ ప్రభుత్వాలను గద్దె దించాలని పిలుపునిచ్చారు. తెలంగాణాలో ఇదే పరిస్థితి రాబోతుండగా.. కేసీఆర్ బీజేపీ చెప్పుల్లో కాలు పెట్టి నడిచే అవకాశముందని తెలిపారు. మణిపూర్ సామాజికవేత్త, అధ్యాపకురాలు కిమ్ కోవా మాట్లాడుతూ మణిపూర్‌లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయని, తమకు ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. ఈ సదస్సులో న్యాయవాది ఓరుగంటి శేషగిరిరావు, వైద్యులు భారవి, రమణారావు, అఫ్రోజ్ సమీనా, పౌర సమాజం బాధ్యులు కాకి భాస్కర్, రవిమారుత్, దేవిరెడ్డి విజయ్, క్రాంతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జిల్లాకు వచ్చిన అనీరాజాకు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, క్లైమెంట్, శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు తదితరులు స్వాగతం పలికారు.

క్లుప్తంగా

సరికొత్త ఫీచర్లతో హీరో గ్లామర్



వాహనాన్ని ఆవిష్కరిస్తున్న ఏసీపీ సారంగపాణి, షోరూం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ద్విచక్ర వాహనాలకు సంబంధించి 125 సీసీలో ఆదరణ ఉన్న హీరో గ్లామర్ వాహనాన్ని మళ్లీ మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. సరికొత్త ఫీచర్లు జోడించిన ఈ వాహనాన్ని ఖమ్మంలోని శ్రీశ్రీశ్రీ హీరో షోరూంలో ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి శనివారం విడుదల చేశారు. అనంతరం సంస్థ అధినేత ఈశ్వరప్రగడ హరిబాబు మాట్లాడుతూ డిజిటల్ స్పీడ్ మీటర్, యూఎస్‌బీ మొబైల్ చార్జింగ్ తదితర ఫీచర్లతో వాహనాన్ని తిరిగి మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, షోరూం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం బోధించేందుకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల చైర్‌పర్సన్ హృదయమీనన్ తెలిపారు. జీవశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, సాంఘిక శాస్త్రం, హిందీ, తెలుగు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు వచ్చేనెల 5లోగా దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 94405 25093 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా భాగం నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న కిషన్‌రావు

ఖమ్మంఅర్బన్/ఖమ్మం వైద్యవిభాగం: తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఎన్నికలు త్వరలో జరగనుండగా, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భాగం కిషన్‌రావు శనివారం హైదరాబాద్‌లో నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 13 మంది సభ్యులు ఉండే రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌లో స్థానం కోసం మమత జనరల్ ఆస్పత్రి ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన పోటీ పడనున్నారు. కాగా, యునైటెడ్ ప్రోగ్రెసివ్ డాక్టర్స్ ఫోరం, ప్రభుత్వ వైద్యుల సంఘం తదితర సంఘాలు తనను బలపరుస్తున్నాయని కిషన్‌రావు తెలిపారు.

మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌గా బి.కిరణ్‌కుమార్

డిప్యూటీగా ఎల్.కిరణ్‌కుమార్




బి.కిరణ్‌కుమార్



ఎల్.కిరణ్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేశారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ బి.కిరణ్‌కుమార్‌ను నియమించారు. ఆయన కళాశాలలో జనరల్ సర్జన్ విభాగానికి హెచ్‌ఓడీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే, ఇన్‌చార్జ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఆర్థో విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్లు సూర్యాపేట మెడికల్ కళాశాల నుండి బదిలీపై ఖమ్మం కళాశాలకు రాగా, సీనియారిటీ ప్రాతిపదికన వారికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన బి.వెంకటేశ్వర్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారిగా కొనసాగుతారు.

చంద్రయాన్–3లో గుమ్మడవల్లి వాసి



శివరామకృష్ణ

సత్తుపల్లి: ఇటీవల విజయవంతమైన చంద్రయాన్–3 ప్రాజెక్టులో భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లికి చెందిన డాక్టర్ వి.శివరామకృష్ణ కూడా పాలుపంచుకున్నారు. సత్తుపల్లిలోని నవభారత్ డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థి అయిన ఆయన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వామి కావడం తమకు గర్వకారణంగా ఉందని ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2006–09లో ఆయన బీఎస్సీ ఎంపీసీ పూర్తిచేయగా, ఆ తర్వాత కోల్‌కత్తా ఐఐఎస్ఈఆర్‌లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ, జర్మనీలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ అసోసియేట్‌గా చేసి 2017 నుంచి శ్రీహరికోట సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్‌లోని థర్మల్ ప్రొటెక్షన్ సెక్షన్‌లో సైంటిస్ట్‌గా చేరారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్‌తో పాటు చైర్మన్ గాదె నర్సింహారెడ్డి, కరస్పాండెంట్ జీవీ లింగారెడ్డి, డైరెక్టర్లు ఎంవీ నర్సారెడ్డి, ఎం.సత్యనారాయణ, ఎండీ రియాజ్ తదితరులు శనివారం అభినందించారు.

అంగన్‌వాడీలకు కాస్త ఊరట !

నూతన పాలసీపై మిశ్రమ స్పందన

- మినీ సెంటర్ల అప్‌గ్రేడ్‌పై ఆనందం
- పదవీ విరమణ ప్యాకేజీపై మాత్రం పెదవి విరుపు
- పింఛన్ ఇవ్వడంతో పాటు సాయం పెంచాలని వినతి



అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠం చెబుతున్న టీచర్

ఖమ్మంగాంధీచౌక్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలసీని ఆమోదించింది. ఇందులో ఉద్యోగ విరమణ, పెన్షన్ అంశాలను చేర్చారు. ప్రభుత్వ పథకాల అములులో కీలకంగా వ్యవహరించే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇన్నాళ్లు రిటైర్‌మెంట్ తర్వాత నామమాత్రంగానే ఆర్థిక సాయం అందేది. ఈ నేపథ్యాన టీచర్లు, హెల్పర్లకు ఓ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి నూతన పాలసీని తీసుకొచ్చింది. ఇందులో ఉద్యోగ విరమణ వయసును 65ఏళ్లుగా నిర్ణయించి, టీచర్లకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. అలాగే, ఆసరా పెన్షన్ అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఇందులో ఆర్థిక సాయం విషయంపై అంగన్‌వాడీ టీచరుచాయాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

మినీ అంగన్‌వాడీల అప్‌గ్రేడ్

ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో ఓ టీచర్, హెల్పర్ పనిచేస్తుండగా, మినీ కేంద్రంలో ఒక్క టీచర్ మాత్రమే పనిచేస్తారు. అలాగే, ప్రధాన అంగన్‌వాడీల్లో పనిచేసే టీచర్ల వేతనాలతో పోలిస్తే మినీ సెంటర్లలో టీచర్ల వేతనాలు తక్కువగా ఉన్నాయి. జనాభా పెరుగుతుండడంతో మినీ అంగన్‌వాడీలకు వచ్చేవారి సంఖ్య పెరగడంతో అన్నింటినీ నూతన పాలసీలో ఒకే కేటగిరీలోకి మార్చారు. తద్వారా జిల్లాలోని 235 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు కూడా ప్రధాన సెంటర్లుగా మారనున్నాయి. ఫలితంగా అదనంగా హెల్పర్ అందుబాటులోకి రావడంతో పాటు టీచర్ల వేతనం పెరుగుతుంది.

సాయం తక్కువే...

అంగన్‌వాడీల కేంద్రాల నిర్వాహకుల్లో నూతన పాలసీపై మిశ్రమ స్పందన వస్తోంది. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన సెంటర్లుగా మార్చడంపై టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, హెల్పర్లు మాత్రం నూతన పాలసీలో తమ వేతనం పెంపును ప్రస్తావించడం లేదని చెబుతున్నారు. ఉద్యోగ విరమణ వయస్సును నిర్ధారించడాన్ని స్వాగతిస్తూనే... ఆర్థిక సాయం మాత్రం తక్కువగా ఉన్నందున మరింత పెంచాలని కోరుతున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ఆసరా పెన్షన్‌గా ప్రకటించడం సరికాదని, ఉద్యోగుల మాదిరి పింఛన్ ఇస్తేనే బాగుండేందని అభిప్రాయపడుతున్నారు.

ఏళ్ల తరబడి సేవ చేస్తే...



ఏళ్ల తరబడి హెల్పర్‌గా పనిచేస్తే 65 ఏళ్ల వయస్సులో రూ. 50 వేలు చేతిలో పెడతారా? వృద్ధులం కావడంతో ఎలాగూ ఎవరికైనా ఆసరా పెన్షన్ వస్తుంది. దీనికి తోడు మరికొంత పెన్షన్‌ను అదనంగా ఇచ్చి నగదు సాయం పెంచాలి.
– రాంబాయమ్మ, హెల్పర్, గుట్టలబజార్, ఖమ్మం

అప్‌గ్రేడ్ ఆనందం



ఏళ్లుగా అంగన్‌వాడీల అప్‌గ్రేడ్ కోసం ఎదురుచూస్తున్నాం. టీచర్‌గానే కాక హెల్పర్ సేవలు చేస్తూనే ప్రభుత్వ పథకాల విధులను నిర్వర్తించినా జీతం తక్కువగానే వచ్చేది. ఇప్పుడు అప్‌గ్రేడ్ చేస్తే జీతం పెరగడమే కాక హెల్పర్ వస్తారు.
– సీహెచ్.పద్మ, శ్రీరాంనగర్ ముస్తఫానగర్, ఖమ్మం

ఆర్థిక సాయం పెంచాలి



ఉద్యోగ విరమణ చేశాక ఇచ్చే ఆర్థిక సాయం తక్కువగా ఉంది. ఏళ్ల తరబడి పనిచేస్తే కేవలం రూ. లక్ష మాత్రమే ఇవ్వటం సరైంది కాదు. ఆర్థిక సాయాన్ని మరింతగా పెంచేలా విషయమై ప్రభుత్వం పునరాలోచిస్తే మేలు జరుగుతుంది.
– మద్దినేని గీత, తిరుమలాయపాలెం–1

ప్యాకేజీ, పెన్షన్‌పై అసంతృప్తి



ఉద్యోగ వయసు నిర్ణయించడం సరైనదే అయినా ప్యాకేజీ, పెన్షన్ విధానం మాత్రం అసంతృప్తిగా ఉన్నాయి. వృద్ధాప్యంలో రూ.లక్ష ఏ మాత్రం సరిపోదు. పెన్షన్‌ను ఆసరాకు ముడి పెట్టడం సరికాదు. ఈ విషయమై మరోసారి పరిశీలించాలి.
– వెంకటరమణ, టీచర్, గాంధీనగర్–3

పెద్దమ్మతల్లికి ఈటల పూజలు



కారేపల్లిలో ర్యాలీగా వస్తున్న ఈటల రాజేందర్

కారేపల్లి: బీజేపీ ఎన్నికల ప్రచార కన్వీనర్ ఈటల రాజేందర్ శనివారం కారేపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ సెంటర్‌లో బీజేపీ, ముదిరాజ్ సంఘం నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఆతర్వాత బస్టాండ్ సెంటర్ వద్ద ముదిరాజ్‌ల జెండా ఎగురవేశారు. ఈసందర్భంగా వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరనుండగా, సభ ఏర్పాటుచేశారు. అయితే, కొత్తగూడెం వెళ్లాల్సి ఉండడంతో ఆలస్యమవుతోందని ఈటల రాజేందర్ బస్టాండ్ సెంటర్ నుంచి వెళ్లిపోయారు. దీంతో బీజేపీ, ముదిరాజ్ సంఘం నాయకులు నిరుత్సాహానికి గురయ్యారు. అనంతరం బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యాన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు వట్టం నాగేశ్వరరావు, శివరాం, ముక్తి కోటేశ్వరరావు తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాత్రావత్ మోహన్‌నాయక్, తురక నారాయణ, భూక్యా సుజాత, కల్తి రాంప్రసాద్, ధనసరి శ్రీనివాస్, జిత్తా నాయక్, మల్లేష్, కొండపల్లి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



ఎంఈఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి శనివారం ఆయన వీసీ ద్వారా జిల్లా అధికారులతో సమీక్షించి ఓటరు జాబితా తయారీ, దరఖాస్తుల స్వీకరణ, విచారణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ జిల్లా అధికారులతో సమావేశమై రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలపై దిశానిర్దేశం చేశారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, ఆర్డీఓలు గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, మాస్టర్ ట్రెయినర్ శ్రీరామ్, సీపీఓ శ్రీనివాస్, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంఈఎస్‌లు

క్షేత్ర స్థాయి శిక్షణ కోసం జిల్లాకు వచ్చిన మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఎంఈఎస్) అధికారులు శనివారం కలెక్టర్ గౌతమ్‌ను కలిశారు. ఈ సందర్భంగా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం, కామేపల్లి మండలం కొమ్మినేపల్లి, తల్లాడ మండలం కుర్నవెల్లి, కల్లూరు మండలం ముచారంల్లో తమ అధ్యయనంలో వెల్లడైన అంశాలపై చర్చించారు. ఈకార్యక్రమంలో డీఆర్డీఓ విద్యాచందన, మానవ వనరుల శిక్షణా సంస్థ మేనేజర్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు

రఘునాథపాలెం: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి ఉద్యోగులతో మాట్లాడారు. అర్హులను ఓటర్లుగా నమోదు చేయించడంతో పాటు చేర్పులు, మార్పులపై దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అలాగే, చనిపోయిన వారు పేర్లను విచారణ అనంతరం జాబితా నుంచి తొలగించాలని చెప్పారు. బీఎల్ఓలు ఎం.షాలిని, కె.కవిత పాల్గొన్నారు.

చిన్నతండాలో ఆలయ భూమిపూజ

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండా పరిధి చిన్నతండా గ్రామంలో జగదాంబ, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వనపర్తి ఏఎస్పీ తేజావత్ రామదాసు హాజరుకాగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు సమష్టిగా ముందుకు సాగుతూ అభివృద్ధి చేసుకోవాలని, ఇందుకు తాను సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థల దాత డి.కోటేశ్వరరావును కూడా సన్మానించగా, సర్పంచ్ భూక్యా సుధాకర్‌తో పాటు కాంతారావు, వెంకటేశ్వర్లు, బాల్యా, శివాజీ, రాములు, డి.నాగేశ్వరరావు, ధరావత్ రాధాకృష్ణమూర్తి, ధర్మా పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి ఖమ్మంకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఖమ్మంకు చెందిన నైషధం వెంకట శ్యామసుందరావు, రాజరాజేశ్వరి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని నిత్యాన్నదానం కోసం రూ.లక్ష విరాళాన్ని శనివారం అందజేశారు. ఈమేరకు దాతలకు అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

రేపు 'నిధి ఆప్‌కే నిఖత్'

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం సోమవారం 'నిధి ఆప్‌కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీం ఖాన్ తెలిపారు. సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని సమస్యలను వెల్లడించవచ్చని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వాసులు కల్లూరులోని లార్జ్‌సైజ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయం ఆవరణలో, భద్రాద్రి జిల్లావాసులు ఇల్లెందు మున్సిపల్ ఆఫీస్ వద్ద సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సూచించారు.

మహిళలకు న్యాయ సమానత్వం అవసరం



మాట్లాడుతున్న జడ్జి ఆశారాణి

ఖమ్మం లీగల్: మహిళలకు ఆర్థిక, సాంఘిక, రాజకీయ, న్యాయ సమానత్వం అవసరమని మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.ఆశారాణి తెలిపారు. ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా సమానత్వ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్జి పలు చట్టాలు, సమానత్వపు హక్కుపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారతా విభాగం కన్వీనర్ డాక్టర్ విద్యాప్రవీణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాకేష్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లుతో పాటు డాక్టర్ మార్థియానా, డాక్టర్ రాజిరెడ్డి, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



మాట్లాడుతున్న జోనల్ ఇన్‌చార్జ్ విజయభాస్కర్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏ.వరదారెడ్డి సూచించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ఇన్‌స్పైర్ – ఇగ్నైట్ ఆధ్వర్యాన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వరదారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుపైనే దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయని, తద్వారా తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేరుతాయని తెలిపారు. అనంతరం డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య ప్రతీ విద్యార్థి జీవితంలో కీలకమని చెప్పారు. ఈకార్యక్రమంలో డీన్లు శీలం శ్రీనివాసరెడ్డి, మధుబాబు, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, అశోక్, ప్రశాంత్, కాంతారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీసీఎం ఢీకొని ట్యాంకర్ డ్రైవర్ మృతి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం సమీపాన జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుండి వచ్చిన డీసీఎం ఢీకొట్టగా ట్యాంకర్ డ్రైవర్ పాలెం శేఖర్‌గౌడ్ (45) అక్కడిక్కడే మృతి చెందాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కృష్ణాపురానికి చెందిన శేఖర్‌గౌడ్ ట్యాంకర్ డ్రైవర్‌గా, అదే ట్యాంకర్‌కు ఆయన కుమారుడు జగదీష్ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరు శుక్రవారం ఏపీలోని చింతలపూడి నుండి పామాయిల్ లోడ్‌తో హైదరాబాద్ బయలుదేరారు. రాత్రి 10.30గంటలకు నాయకన్‌గూడెం ఫ్లైఓవర్ పైకి రాగానే ట్యాంకర్ హోసింగ్ టైర్లు ఊడిపోవటంతో పక్కకు ఆపి శేఖర్ పరిశీలిస్తున్నాడు. ఈ సమయంలో ఖమ్మం నుండి సూర్యాపేట వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో శేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై మృతుడి కుమారుడు జగదీష్ శనివారం ఇచ్చిన ఫిర్యాదుతో డీసీఎం డ్రైవర్ కొత్తా ఉదయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

సత్తుపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడికి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. పెనుబల్లి మండలం చిన్నమ్మగూడెంకు చెందిన రాయిని కృష్ణప్రసాద్ (19) తన స్నేహితుడితో కలిసి ఈనెల 22వ తేదీన ద్విచక్రవాహనంపై సత్తుపల్లి వస్తుండగా జ్యోతి నిలయం సమీపాన రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన కృష్ణప్రసాద్‌ను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

డీసీఎం, టిప్పర్ ఢీ.. డ్రైవర్‌కు గాయాలు



ప్రమాదస్థలంలో వాహనాలు

కొణిజర్ల: రోడ్డుపై గుంతను తప్పించబోయి ఓ డీసీఎం వాహనం టిప్పర్‌ను ఢీకొట్టడంతో డీసీఎం డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కొణిజర్ల సమీపాన శనివారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. వైరా వైపు నుంచి వస్తున్న డీసీఎం వాహనం కొణిజర్ల పోలీస్‌స్టేషన్ సమీపాన జాతీయ రహదారిపై గుంతను తప్పించబోయి ఖమ్మం వైపు నుంచి వస్తున్న టిప్పర్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో డీసీఎం క్యాబిన్ నుజునుజ్జు కాగా డ్రైవర్ సన్యాసిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. డీసీఎం నడిరోడ్డుపై నిలిచిపోవడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ఎస్ఐ జె.శంకరరావు సిబ్బందితో చేరుకుని డీసీఎంను పక్కకు తప్పించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఆ వెంటనే రహదారిపై గుంతలో మెటల్ మిక్సర్‌తో పూడ్చివేయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కోరట్లగూడెం సమీపాన శనివారం రాత్రి జరిగింది. మహబూబాబాద్‌కు చెందిన కూలీలు శనివారం పని ముగిశాక రోడ్డు పక్క నుంచి నడిచివెళ్తున్నాడు. అదే సమయంలో అబ్దుల్ మజీద్ బైక్‌పై వస్తూ కూలీ సుధాకర్‌ను బలంగా ఢీకొట్టగా గాయాలయ్యాయి. అలాగే, మజీద్‌కు కూడా తీవ్ర గాయాలు కావటంతో ఇద్దరిని ఖమ్మం తరలించారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య



సాయిరాం (ఫైల్)

కామేపల్లి(కారేపల్లి): ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడని తల్లి మందలించటంతో మనస్థాపం చెందిన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జోగ్గూడెంకు దంపతులు ధరావత్ దేవి–దేవాకు కుమారుడు సాయిరాం (24) ఉన్నాడు. కాగా, దేవా పదిహేనేళ్ల క్రితం మృతి చెందటంతో కుమారుడైన తల్లి దేవి సాయిరాంను కూలీ పనులు చేస్తూ పెంచి పెద్దచేసింది. ఇంటర్ పూర్తయ్యాక ట్రాక్టర్ డ్రైవర్‌గా కొన్నాళ్లు పనిచేసిన ఆయన ఇటీవల ఖాళీగా ఉంటున్నాడు. దీంతో ఖాళీగా ఉండడం ఎందుకు, ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసినా ఇల్లు గడుస్తుంది కదా అని తల్లి శుక్రవారం మందలించింది. దీంతో సాయిరాం ఇంట్లో నుంచి వెళ్లి అదేరోజు సాయంత్రం పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు సాయిరాంను ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా శనివారం మృతి చెందాడు.

ప్రమాదంలో మూడు కార్లు ధ్వంసం

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద శనివారం జరిగిన ప్రమాదంలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... ఇల్లెందు వైపు నుండి ఖమ్మం వెళ్తున్న ఓ కారును వెనక నుండి అతివేగంగా వచ్చిన ఇంకో కారు ఢీకొట్టింది. దీంతో మొదటి కారు వెళ్లి ముందున్న మరో కారును ఢీకొట్టడంతో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నాగుల్‌మీరాకు తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అతివేగంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా, ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కొండల్‌రావు తెలిపారు.

క్లుప్తంగా...

యూఏఈలో ఉచిత నియామకాలు

- ఏడీఎస్‌హెచ్‌ కంపాస్‌ కంపెనీ వీసాలు
- ముంబైలో ఇంటర్వ్యూలకు ఉచిత బస్సు సౌకర్యం

మోర్తాడ్‌ (బాల్కొండ): యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌ (యూఏఈ)లో ప్రముఖ క్యాటరింగ్‌ సపోర్ట్‌ సర్వీసెస్‌ సంస్థగా పేరొందిన ఏడీఎస్‌హెచ్‌ కంపాస్‌ సంస్థ ఉచిత నియామకాల ప్రక్రియను చేపట్టింది. తెలంగాణలోని జీటీఎం ఇంటర్నేషనల్‌ రిక్రూటింగ్‌ ఏజెన్సీ ఆధ్వర్యంలో ముంబైలో ఈనెల 31, సెప్టెంబర్‌ 1 తేదీల్లో ఇంటర్వ్యూలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ముంబైలో రెండ్రోజులు జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే నిరుద్యోగులను ఇక్కడి నుంచి తీసుకెళ్లి.. మళ్లీ ఇంటికి పంపించడానికి ఉచిత బస్సు సౌకర్యం కూడా జీటీఎం సంస్థ కల్పించింది. ఈసీఎన్‌ఆర్‌ పాస్‌పోర్టు కలిగిన 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారు ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అభ్యర్థులు కాస్త ఆంగ్ల పరిజ్ఞానం కలిగి ఉండాలని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ వివరాలను జీటీఎం సంస్థ మొబైల్‌ నంబర్లు 8332013999, 8332016999, 8332052299లో ఒకదానికి వాట్సాప్‌ చేయాలని జీటీఎం సంస్థ ఎండీ చీటీ సతీశ్‌రావు 'సాక్షి'కి తెలిపారు. ఉచిత నియామకాల ప్రక్రియను వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని, ఎవరూ నయాపైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఓయూ మాజీ వీసీ నవనీతరావు కన్నుమూత



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాజీ వీసీ ప్రొ.నవనీతరావు (95) శుక్రవారం రాత్రి బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. కరీంనగర్‌ జిల్లాకు చెందిన ఆయన ఓయూ కెమిస్ట్రీ విభాగంలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేసి 1970లో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. బోధన, పరిశోధనలో ప్రతిభను చాటుతూ 220 పరిశోధన వ్యాసాలను, 5 పుస్తకాలు రాశారు. ఆయన పర్యవేక్షణలో 24 మంది పరిశోధన విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 160 పరిశోధన వ్యాసాలను సమర్పించారు. ఓయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులుగా వివిధ పాలన పదవులు చేపట్టిన ప్రొ.నవనీతరావు.. యంగ్‌ సైంటిస్ట్‌ అవార్డులతో పాటు ఇతర అనేక అవార్డులను అందుకున్నారు.

ఢిల్లీ తరువాత మనమే..

- 'అద్దె ఇళ్ల డిమాండ్‌'లో షహర్‌ హైదరాబాద్‌కు రెండోస్థానం
- డబుల్‌ బెడ్రూంవైపే అత్యధికుల మొగ్గు
- 'మ్యాజిక్‌ బ్రిక్స్‌' అధ్యయనంలో వివిధ అంశాలు వెల్లడి

సాక్షి, హైదరాబాద్‌: భారత్‌లో అద్దె ఇళ్ల మార్కెట్‌ (రెంటల్‌ మార్కెట్‌) అంతకంతకూ వృద్ధి చెందుతోంది. సింగిల్‌, డబుల్‌ బెడ్‌రూం అద్దె ఇళ్లకు భారీగా డిమాండ్‌ పెరుగుతోంది. అద్దె ఇళ్ల కోసం వెతుకుతున్న వారిలో అత్యధికశాతం (80 శాతం) మంది సౌకర్యవంతమైన చిన్న అపార్ట్‌మెంట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. అద్దె ఇళ్ల డిమాండ్‌లో దేశరాజధాని ఢిల్లీ 27.25 శాతంతో ప్రథమ స్థానంలో, హైదరాబాద్‌ నగరం 22 శాతంతో ద్వితీయ స్థానంలో నిలుస్తోంది. పుణే (19.3 శాతం), ముంబై (18.35 శాతం), బెంగళూరు (12.8 శాతం) తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. గతంతో పోల్చితే గత మూడునెలల్లో (ఏప్రిల్‌–జూన్‌ మధ్యకాలంలో) రెంటల్‌ డిమాండ్‌ 18.1 శాతం పెరగగా, అదే సమయంలో రెంటల్‌ సప్లయ్‌లు కూడా 9.6 శాతం, అద్దెలు 4.9 శాతం పెరిగాయి. ఆ మూడునెలల కాలంలో సగటు అద్దెల పెరుగుదలలో బెంగళూరు (8.1 శాతం). నవీ ముంబై (7.3 శాతం), గురుగ్రామ్‌ (5.1 శాతం) ముందువరసలో నిలుస్తున్నాయి. అదేసమయంలో కొన్ని నగరాల్లో అద్దెల్లో స్వల్ప శాతం పెరుగుదల నమోదైంది. ప్రముఖ రియల్‌ ఎస్టేట్‌ సంస్థ 'మ్యాజిక్‌ బ్రిక్స్‌'గత ఏప్రిల్‌–జూన్‌ నెలలకు సంబంధించి దేశంలోని 13 ప్రధాన నగరాల్లో అద్దె ఇళ్లకున్న డిమాండ్‌ను పరిశీలించి విడుదల చేసిన రెంటల్‌ ఇండెక్స్‌లో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి.



'డబుల్‌'కు లేదు సాటి...

మరీ విలాసవంతంగా కాకపోయినా ఉన్నంతలో సౌకర్యవంతంగా ఉండేలా డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను అద్దెకోసం అత్యధికులు కోరుకుంటున్నారు. అద్దె ఇళ్ల డిమాండ్‌, సప్లయ్‌ శాతంలో డబుల్‌ బెడ్‌రూం ఇళ్లకు 57 శాతం, వన్‌ బీహెచ్‌కే ఇళ్లకు 27 శాతం, ట్రిపుల్‌ బెడ్‌రూం ఇళ్ల కోసం 18 శాతం డిమాండ్‌ ఉన్నట్టుగా ఈ నివేదిక ద్వారా తెలుస్తోంది. అంతకు ముందు నెలలతో (జనవరి–మార్చి మధ్యలో) పోల్చితే గత ఏప్రిల్‌–జూన్‌ల మధ్య త్రీ బీహెచ్‌కేల డిమాండ్‌ 36 శాతం నుంచి 18 శాతానికి (సగానికి) పడిపోయినట్టు తెలిపింది. అదే సింగిల్‌ బెడ్‌రూంల డిమాండ్‌ 17 శాతం నుంచి 27 శాతానికి పెరిగింది. సామాన్య, దిగువ, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా అద్దెలు ఉండటమే ఆయా ప్రధాన నగరాల్లో సింగిల్‌, డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల డిమాండ్‌ పెరగడానికి ముఖ్య కారణంగా మ్యాజిక్‌ బ్రిక్స్‌ అంచనా వేస్తోంది. నెలకు రూ.10 నుంచి 20 వేలలోపు అద్దె ఉన్న ఇళ్లకు కిరాయిదారులు అత్యధికంగా మొగ్గుచూపుతున్నారు. వీరిలో ఎక్కువమంది 500 చదరపు అడుగుల నుంచి వెయ్యి చదరపు అడుగుల కవర్డ్‌ ఏరియా ఉన్న అద్దె ఇళ్లు తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకంగా హైదరాబాద్‌ విషయానికొస్తే... (గత ఏప్రిల్‌–జూన్‌ మధ్యకాలంలో)

- హైదరాబాద్‌లో అద్దె ఇళ్ల డిమాండ్‌ 22 శాతం పెరుగుదల (ఆన్‌లైన్‌, ఇతరత్రా రూపాల్లో వెతకడం–యాక్టివ్‌ లిస్టింగ్స్‌లో)
- ఏప్రిల్‌–జూన్‌ల మధ్య అద్దెలు 4.5 శాతం వృద్ధి
- ఓఆర్‌ఆర్‌కు దగ్గరలో ఉండడంతో పాటు ప్రధాన ఐటీ, ఇతర ఉద్యోగ కేంద్రాలకు సమీపంగా ఉన్న కారణంగా మైక్రో మార్కెట్స్‌లో అద్దె ఇళ్ల కోసం అత్యధికంగా సెర్చ్‌ చేస్తున్న ప్రాంతాల్లో గచ్చిబౌలి, కొండాపూర్‌ అగ్రభాగాన నిలుస్తున్నాయి
- నగరంలోని ఆయా ప్రాంతాల్లో రూ.20 వేలు–32 వేలలోపున్న టూ బీహెచ్‌కేల కోసం ఎక్కువ మంది ప్రాధాన్యతనిస్తున్నారు

దేశంలోని ప్రధాననగరాలకు గత ఏడాది కాలంగా ఉద్యోగులు, విద్యార్థులు తిరిగి చేరుకుంటుండడంతో అద్దె ఇళ్లకు డిమాండ్‌ క్రమంగా పెరుగుతోంది. ఉద్యోగుల్లో అత్యధిక శాతం ఆఫీసుల నుంచి పనిచేస్తుండటంతో వాటికి దగ్గరగా ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నారు.
– సుధీర్‌ పాయ్‌, సీఈవో, మ్యాజిక్‌ బ్రిక్స్‌

హైదరాబాద్‌లో అద్దెలిలా...

లోకాలిటీ	2 బీహెచ్‌కే	3 బీహెచ్‌కే
గచ్చిబౌలి	24,000	35,000
కొండాపూర్‌	21,000	30,000
హైటెక్‌ సిటీ	32,000	47,000
మాదాపూర్‌	21,000	30,000
కోకాపేట్‌	23,000	33,000
నార్సింగి	22,000	32,000
కూకట్‌పల్లి	16,000	23,000
బంజారాహిల్స్‌	20,000	30,000
నల్లగండ్ల	22,000	32,000
జూబ్లీహిల్స్‌	23,000	33,000
మణికొండ	17,000	24,000

టెట్‌పై పట్టు ఏదీ?

- పరీక్ష రాసే వారిలో సగం మందికంటే తక్కువే పాస్‌..
- ఏడేళ్లుగా ఇదే తరహాలో ఫలితాలు
- కనీస అర్హత మార్కులు ఎక్కువ..
- ఇంగ్లిష్‌పై పట్టులేక ఇబ్బంది
- టీచర్ల నియామకాలు లేకపోవడం కూడా కారణమంటున్న అభ్యర్థులు
- సీరియస్‌గా సిద్ధం కాలేకపోతున్నామని ఆవేదన



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ శిక్షణ తీసుకుంటున్నా.. ఆ తర్వాత ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్‌)లో మాత్రం చాలా మంది ఫెయిలవుతున్నారు. బీఎడ్‌ విద్యార్హతతో రాసే పేపర్‌–2లో 2011 నుంచి ఇప్పటివరకు ప్రతిసారీ ఉత్తీర్ణత శాతం సగం కూడా దాటలేదు. తెలంగాణ ఏర్పాటయ్యాక ఒక్క 2022లో తప్ప ఎప్పుడూ ఉత్తీర్ణత 30% కూడా దాటకపోవడం గమనార్హం. ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌ ఇస్తామని గతేడాది ప్రకటించడంతో.. ప్రైవేటు బడుల్లో పనిచేస్తున్నవారు సహా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు కోచింగ్‌ కేంద్రాలకు వెళ్లి మరీ టెట్‌ కోసం సిద్ధమయ్యారు. అయినా పాస్‌ శాతం తక్కువే నమోదైంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్‌తోపాటు టెట్‌ నోటిఫికేషన్‌ ఇచ్చేవారని.. టీచర్‌ పోస్టుల భర్తీపై నమ్మకం ఉండేదని అభ్యర్థులు చెప్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక 2017లో మినహా ఇంతవరకు టీచర్‌ పోస్టుల భర్తీ జరగలేదు. దీంతో టెట్‌పై అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని, సీరియస్‌గా ప్రిపేర్‌ కాకుండానే పరీక్షలు రాస్తున్నారని నిపుణులు అంటున్నారు.

అందని అర్హత గీటురాయి: టెట్‌ ప్రశ్నపత్రం 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత పొందాలంటే ఓపెన్‌ కేటగిరీ అభ్యర్థులు కనీసం 90 మార్కులు, బీసీలు 75 మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 60 మార్కులు సాధించాలి. పేపర్‌–1 (డీఎడ్‌ అర్హతతో రాసేది)తో పోలిస్తే, పేపర్‌–2 (బీఎడ్‌ అర్హతతో రాసేది) కష్టంగా ఉంటోందని పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు చెప్తున్నారు. మేథ్స్‌, ఇంగ్లిష్‌ పై పట్టు ఉంటే తప్ప కనీసం 90 మార్కులు సాధించడం కష్టమేనని.. ముఖ్యంగా మేథ్స్‌లో సరైన సమాధానం రాబట్టేందుకు ఎక్కువ సమయం పడుతోందని అంటున్నారు. కనీసం 6 నెలల పాటు మోడల్‌ ప్రశ్నలు చేసి ఉంటేనే ఇది సాధ్యమవుతుందని వివరిస్తున్నారు. ఇక ఇంగ్లిష్‌లో ప్రధానంగా జాతీయాలు, మోడ్రన్‌, అడ్వాన్స్‌డ్‌ లాంగ్వేజ్‌ నుంచి ప్రశ్నలు ఇస్తున్నారని.. వీటికి తగ్గ ప్రిపరేషన్‌ ఉండటం లేదని స్పష్టం చేస్తున్నారు. అదే పేపర్‌–1 ఇంటర్మీడియట్‌ స్థాయిలో ఉంటోందని.. బోధన మెళకువలు, మోడ్రన్‌ టీచింగ్‌ మెథడ్స్‌పై దృష్టి పెడితే తేలికగా గట్టెక్కగలుగుతున్నారని నిపుణులు అంటున్నారు.

నాలుగున్నర లక్షల మందిలో..

రాష్ట్రంలో 1.5 లక్షల మంది డీఎడ్‌ ఉత్తీర్ణులు, 4.5 లక్షల మంది బీఎడ్‌ ఉత్తీర్ణులు కలిపి ఆరు లక్షల మందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు ఉన్నారు. వీరిలో సుమారు 4 లక్షల మంది మాత్రమే ఇప్పటివరకు టెట్‌ ఉత్తీర్ణత సాధించగలిగారు. టెట్‌లో పేపర్‌–1 పాసైతే.. 1–5 వరకూ బోధించే 'సెకండరీ గ్రేడ్‌ టీచర్‌ (ఎస్జీటీ)' పోస్టులకు.. పేపర్‌–2 పాసైతే పదో తరగతి వరకు బోధించే 'స్కూల్‌ అసిస్టెంట్‌ (ఎస్‌ఏ)' పోస్టులకు పోటీపడే వీలు ఉంటుంది. డీఎడ్‌ పూర్తిచేసినవారు పేపర్‌–1 మాత్రమే రాసే వీలుండగా.. బీఎడ్‌ వారు పేపర్‌–1, పేపర్‌–2 రెండూ రాయవచ్చు. అయితే పేపర్‌–1 కాస్త సులువుగా ఉంటుండటంతో.. చాలా మంది బీఎడ్‌ వారు పేపర్‌–1పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని, ఇదికూడా పేపర్‌–2లో అర్హత శాతం తగ్గడానికి కారణమవుతోందని నిపుణులు చెప్తున్నారు.

ఇంగ్లిష్‌, మేథ్స్‌కు కష్టపడాలి

కేవలం 45 రోజుల్లోనే టెట్‌కు ప్రిపేర్‌ అవ్వాలంటే చాలా కష్టపడాలి. ఇంగ్లిష్‌, మేథ్స్‌లో మంచి మార్కులు సాధిస్తేనే అర్హత సాధించవచ్చు. దీనికి ప్రత్యేక సన్నద్ధత అవసరం. టీచర్‌ పోస్టులు వస్తాయనే ఆశతో కోచింగ్‌ కేంద్రాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నాం. కానీ టీచర్‌ నోటిఫికేషన్‌ రాకపోవడం నిరాశగా ఉంది.
– స్వాతి, టెట్‌ అభ్యర్థి, భూపాలపల్లి

నియామకాలుంటేనే ఉత్సాహం

టెట్‌ ఉత్తీర్ణులు లక్షల్లో ఉన్నారు. టీచర్‌ పోస్టులు వస్తాయని ఆశతో ఉన్నాం. కానీ ఏటా నిరాశే ఎదురవుతోంది. నియామక నోటిఫికేషన్‌ వస్తేనే మాకూ ఉత్సాహంగా ఉంటుంది. ఈసారైనా రిక్రూట్‌మెంట్‌ నిర్వహిస్తారని ఆశిస్తున్నాం.
– ఇఫ్రాన్‌ పాషా, టెట్‌ అభ్యర్థి, ములుగు జిల్లా

2011 నుంచి టెట్‌ ఉత్తీర్ణత శాతం

ఏడాది	పేపర్‌–1	పేపర్‌–2
2011	44.27	49.68
2012	44.53	47.02
2014	61.86	28.56
2016	54.45	25.04
2017	57.37	19.51
2022	32.68	49.64

కొడుకును బావిలో పడేసి.. ఆపై పురుగు మందు తాగి..

- బాలుడి మృతి.. చికిత్స పొందుతున్న తండ్రి
- కుటుంబంలో ఆస్తి గొడవలే కారణమా?


దేవాన్ష్‌ (ఫైల్‌)


చికిత్స పొందుతున్న తిరుపతిరెడ్డి

ఎలిగేడు: కుటుంబంలో ఆస్తి గొడవలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి కొడుకు(17 నెలలు)ను బావిలో పడేసి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో బాలుడు మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాములపల్లికి చెందిన కల్వల తిరుపతిరెడ్డి, మానస దంపతులు. వీరికి దేవాన్ష్‌ (17 నెలలు) సంతానం. తిరుపతిరెడ్డి, అతడి సోదరుడు రత్నాకర్‌రెడ్డి మధ్య కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. మూడునెలల క్రితం పంచాయితీ పెట్టి పెద్దల సమక్షంలో ఆస్తి పంచుకున్నారు. అప్పటి నుంచి తిరుపతిరెడ్డి భార్య, కుమారుడితో కలిసి సుల్తానాబాద్‌లోని ఓ అద్దింట్లో నివాసం ఉంటున్నాడు. ఆస్తి పంపకాల విషయమై చంపుతామని తరచూ కొందరు బెదిరిస్తున్నారని భార్యతో చెప్పుకుని తిరుపతిరెడ్డి బాధపడేవాడు. ఈ క్రమంలో రాములపల్లిలో ఉంటున్న తల్లిదండ్రులకు తన కుమారుడిని చూపించి తీసుకొస్తానని భార్యతో చెప్పి బయల్దేరాడు. అయితే ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్తకు మానస ఫోన్‌ చేయగా సమాధానం రాలేదు. వెంటనే అత్తామామలకు ఫోన్‌ చేయగా రాములపల్లికి రాలేదని వారు చెప్పారు. అనుమానంతో పొలం వద్దకు వెళ్లి చూడగా తిరుపతిరెడ్డి అపస్మారకస్థితిలో కనిపించాడు. బావిలో బాలుడి చెప్పులు కన్పించాయి. తిరుపతిరెడ్డిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. కాస్త తేరుకున్నాక దేవాన్ష్‌ గురించి అడుగగా తానే బావిలో పడేసి గడ్డిమందు తాగానని చెప్పాడు. విషయం తెలుసుకున్న సుల్తానాబాద్‌ సీఐ జగదీశ్‌, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ బావి వద్దకు చేరుకుని గ్రామస్తుల సహకారంతో దేవాన్ష్‌ మృతదేహాన్ని బయటకు తీయించారు. మానస ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

జిల్లా వార్తలు

ఎదురుకాల్పులపై 5న విచారణ

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో 2021లో పోలీసులు–మావోయిస్టుల నడుమ జరిగిన ఎదురుకాల్పుల ఘటనపై వచ్చేనెల 5వ తేదీన విచారణ చేపడుతున్నట్లు భద్రాచలం ఆర్డీఓ మంగిలాల్‌ తెలిపారు. 2021 ఆగస్టు 1న చర్ల మండలం బోధనెల్లి సరిహద్దులో పోలీసులు, మావోయిస్టులకు నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనపై విచారణ జరపాలని కలెక్టర్‌ ఇచ్చిన ఆదేశాలతో భద్రాచలంలోని ఆర్డీఓ, సబ్‌ డివిజనల్‌ మెజిస్ట్రీరియర్‌ కార్యాలయంలో వచ్చేనెల 5వ తేదీన ఉదయం 10.30 గంటలకు విచారణ చేపడుతున్నట్లు ఆర్డీఓ వెల్లడించారు. ఘటన వివరాలు తెలిసిన వారెవరైనా, అభ్యంతరాలు వ్యక్తం చేసే వారైనా మౌఖికంగా కానీ రాతపూర్వకంగా కానీ తెలియజేయాలని సూచించారు.

బాలుర డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

సుజాతనగర్‌: మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాసంస్థ సొసైటీ ఆధ్వర్యాన కొత్తగూడెంలో ఏర్పాటుచేయనున్న బాలుర డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ వి.బ్యూలారాణి తెలిపారు. ఈ విద్యాసంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 31లోగా వేపలగడ్డలోని బీసీ బాలుర వసతిగృహంలో దరఖాస్తు అందజేయాలని, వివరాలకు 89785 52676 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రణాళికాయుతంగా విద్యుత్‌ ఉత్పత్తి

- టీఎస్‌ జెన్‌కో డైరెక్టర్‌ లక్ష్మయ్య


సీహెచ్‌పీని పరిశీలిస్తున్న డైరెక్టర్‌, అధికారులు

పాల్వంచ: విద్యుత్‌ ఉత్పత్తిలో ఎలాంటి అవాంతరాలు రాకుండా పర్యవేక్షిస్తూ ప్రణాళికాయుతంగా పనిచేయాలని టీఎస్‌ జెన్‌కో డైరెక్టర్‌ (థర్మల్‌) బి.లక్ష్మయ్య సూచించారు. పాల్వంచలోని కేటీపీఎస్‌ 7వ దశ కర్మాగారంలో శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కోల్‌ హ్యాండ్లింగ్‌ ప్లాంట్‌ (సీహెచ్‌పీ), వ్యాగన్‌ టిప్లర్‌, ఐసీహెచ్‌పీల్లో పరిశీలించి వర్షాకాలంలో తలెత్తే సమస్యల పరిష్కారంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఈ పి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఈలు గడ్డం శ్రీనివాస్‌, గుర్రం రాజ్‌కుమార్‌, ఎం.శ్రీనివాసరావు, యుగపతి, అధికారులు పాల్గొన్నారు.

రండీ... స్టాంపులు సేకరిద్దాం!

- ఆసక్తి ఉన్న విద్యార్థులకు తపాలా శాఖ అవకాశం
- రెండు దశల్లో పోటీలు... ఎంపికైతే రూ.6వేల స్కాలర్‌షిప్‌
- సెప్టెంబర్‌ 12వరకు దరఖాస్తుల స్వీకరణ



ఖమ్మంగాంధీచౌక్‌: తపాలా స్టాంపుల సేకరణ అభిరుచిగా ఉన్న పాఠశాల విద్యార్థులకు తపాలా శాఖ 2023–24 సంవత్సరానికి గాను దీన్‌దయాళ్‌ యోజన పథకం కింద పిలాటలీ(స్టాంపుల సేకరణ) స్కాలర్‌షిప్‌ ప్రకటించింది. స్టాంపుల సేకరణ అభిరుచి కలిగిన 6నుంచి 9వ తరగతి విద్యార్థులను అర్హులుగా నిర్ణయించారు. వివిధ స్థాయిల్లో స్టాంపుల సేకరణపై క్విజ్‌, ప్రాజెక్టుల పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నెలకు రూ.500 చొప్పున ఏటా రూ.6వేల స్కాలర్‌షిప్‌ అందిస్తారు. గత ఏడాది ఖమ్మంలోని శాంతినగర్‌ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచి తపాలా స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు.

ఎంపిక విధానం

తపాలా స్కాలర్‌షిప్‌నకు ఎంపిక విధానం రెండు స్థాయిల్లో నిర్వహిస్తారు. మొదటి స్థాయిలో రాతపూర్వక క్విజ్‌పోటీలు నిర్వహించి, ఆతర్వాత స్టాంపుల సేకరణపై పోటీ ఏర్పాటు చేస్తారు. క్విజ్‌ పోటీలను ప్రాంతీయ, డివిజనల్‌ స్థాయిలో సెప్టెంబర్‌ 24న నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైన వారు స్టాంపుల సేకరణ ప్రాజెక్టు సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత విజేతలను వెల్లడిస్తారు. కాగా, క్విజ్‌ పోటీల్లో చరిత్ర, కరెంట్‌ ఎఫైర్స్‌, సైన్స్‌, క్రీడలు, సాంస్కృతికం, భూగోళ, స్టాంపుల సేకరణ తదితర అంశాలపై 50 మార్కుల ప్రశ్నలు ఉంటాయి.

వచ్చేనెల 12 వరకు దరఖాస్తులు

అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ దరఖాస్తులను డివిజనల్‌ పోస్టాఫీస్‌కు సెప్టెంబర్‌ 12వ తేదీలోగా చేరేలా స్పీడ్‌ పోస్టు లేదా రిజిస్టర్డ్‌ పోస్టులో పంపించాలి. ఒకే పాఠశాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి కనబరిస్తే అందరి దరఖాస్తులను ఒకే ఎన్వలప్‌లో హెచ్‌ఎంల ద్వారా పోస్టల్‌ అధికారికి అందించవచ్చు. పూర్తి వివరాల కోసం www.indiapost.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని అధికారులు సూచించారు. కాగా, దరఖాస్తులను సూపరింటెండెంట్‌ ఆఫ్‌ పోస్టాఫీస్‌, ఖమ్మం డివిజన్‌, ఖమ్మం–507003 చిరునామాకు పంపించవచ్చు.

ఇవీ అర్హతలు

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీలకు అర్హులు. పాఠశాలలో స్టాంపుల సేకరణ క్లబ్‌ ఉండటంతో పాటు దరఖాస్తు చేసుకునే విద్యార్థి ఆ క్లబ్‌లో సభ్యులుగా ఉండాలి. అలాగే, కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత(5 నుంచి 8వ తరగతి సంవత్సరం పరీక్షల్లో) సాధించి, ప్రస్తుతం 6 నుంచి 9వ తరగతి చదువుతున్న వారు ప్రోగ్రెస్‌ రిపోర్టు, మార్కుల కార్డు ప్రతులతో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, ఎస్సీ, ఎస్టీలకు ఐదు శాతం మినహాయింపు ఉంటుంది.

విద్యార్థులకు సదవకాశం



అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులకు తపాలా స్కాలర్‌ షిప్‌ మంచి అవకాశం. 6 నుంచి 9వ తరగతి మధ్య చదువుతున్న విద్యార్థులు నిర్దేశిత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైతే ఏటా రూ.6 వేల నగదు లభిస్తుంది.
– బి.రవికుమార్‌, పోస్టల్‌ సూపరింటెండెంట్‌, ఖమ్మం డివిజన్‌

లక్ష్మీతాయారు అమ్మవారికి బంగారు పూత కిరీటం





బంగారు పూత కిరీటంతో దాతలు (ఇన్‌సెట్‌) అమ్మవారికి సమర్పించిన కిరీటం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తులు బంగారు పూత కిరీటం వితరణగా అందజేశారు. కాకినాడకు చెందిన గుమ్మల సత్యనారాయణ – సాయి అనురాధ దంపతులు రాగిపై బంగారు పూతతో కిరీటం తయారు చేయించారు. ఈ కిరీటాన్ని శనివారం అంతరాలయంలో మూలమూర్తుల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశాక అధికారులకు అందజేశారు. కిరీటం విలువ రూ.లక్ష ఉంటుందని వారు తెలిపారు. అలాగే, ఏలూరుకు చెందిన చుక్కా పద్మావతి శాశ్వత నిత్యాన్నదానానికి రూ.50,001 విరాళం అందజేశారు. దాతల కుటుంబ సభ్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్‌ సాయిబాబా, అర్చకులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న నేతలు

భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని శనివారం ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. గోవా రాష్ట్రంలోని ముర్ము ఎమ్మెల్యే సంకల్ప్‌ అమోన్‌కర్‌, జార్ఖండ్‌ రాష్ట్రానికి చెందిన దేవగాడ్‌ ఎమ్మెల్యే నారాయణరాజు విడివిడిగా దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకోవడంతో పాటు ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేయగా, పండితులు వేదాశీర్వచనం, స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

క్రీడాపోటీల నిర్వహణకు కార్యాచరణ


మాట్లాడుతున్న జీఎం కట్టా బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆధ్వర్యంలో వార్షిక క్రీడా పోటీల నిర్వహణపై కసరత్తు మొదలుపెట్టారు. కొత్తగూడెంలోని కార్పొరేట్‌ కార్యాలయంలో అన్ని ఏరియాల వర్క్‌ పీపుల్‌ స్పోర్ట్స్‌, గేమ్స్‌ చీఫ్‌ కోఆర్డినేటర్లు, హానరరీ సెక్రటరీలతో జీఎం పర్సనల్‌ (వెల్ఫేర్‌ అండ్‌ ఆర్సీ) కట్టా బసవయ్య శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్‌లో ఏరియాల వారీగా క్రీడాపోటీలు నిర్వహించి, డిసెంబర్‌ నాటికి కంపెనీస్థాయి పోటీలు పూర్తిచేయాలని సూచించారు. క్రీడల్లో సీనియర్‌ క్రీడాకారులకేకాక యువ క్రీడాకారులకు అవకాశం ఇవ్వాలని తెలిపారు. అలాగే, కోల్‌ ఇండియా స్థాయి పోటీల్లో పతకాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఇక కోలిండియా స్థాయిలో సింగరేణికి కేటాయించిన హాకీ టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో అధికారులు కోడూరి శ్రీనివాసరావు, మోహన్‌రావు, ఎస్‌.రమేశ్‌, ముకుంద సత్యనారాయణ, డి.కిరణ్‌బాబు, రాజు, ఎస్‌.వేణుగోపాల్‌, కిరణ్‌కుమార్‌, వరప్రసాద్‌, పాసినెట్‌ పాల్గొన్నారు.

ఏపీలో ఆర్టీసీ విలీనంపై బుక్‌లెట్‌


బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న యూనియన్‌ నాయకులు

చుంచుపల్లి: టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్‌ అండ్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భంగా అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి ఓ బుక్‌లెట్‌ రూపొందించారు. ఈ మేరకు బుక్‌లెట్‌ను శనివారం కొత్తగూడెం బస్టాండ్‌లో విడుదల చేశారు. కాగా, తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనంతో ఎదురయ్యే లాభనష్టాలను ఇందులో వివరించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వి.జాకబ్‌, నాయకుడు రాములు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుట్‌బాల్‌ జట్టులో జిల్లాకు స్థానం


భావన


యాషిత


హర్షితశ్రీ

ఖమ్మంస్పోర్ట్స్‌: వచ్చేనెల 1 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి బాలికల సబ్‌ జూనియర్‌ ఫుట్‌బాల్‌ పోటీలకు ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యాన రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారిణులు ఎంపికయ్యారు. వీవీ పాలెంకు చెందిన భావన, హర్షితశ్రీ, భద్రాచలానికి చెందిన యాషితకు జట్టులో స్థానం దక్కగా గజ్వేల్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సెల్యూకాస్‌, కె.ఆదర్శ్‌ కుమార్‌ తదితరులు శనివారం అభినందించారు.

దడవాయిలను మార్కెట్‌ కార్మికులుగా గుర్తించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ మార్కెట్లలో పనిచేసే దడవాయిలు, వే మెన్‌లను మార్కెట్‌ కార్మికులుగా గుర్తించి నెలకు రూ.35 వేల వేతనం ఇవ్వాలని సంఘం ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ మార్కెట్‌లో తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, లైసెన్సుల రెన్యూవల్‌ సందర్భంగా వయోపరిమితి నిర్ధారించడంతో ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దడువాయిల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.రాంబాబు యాదవ్‌, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్‌, అప్పని కృష్ణతో పాటుట ఎస్‌.సురేందర్‌రెడ్డి, మోటి కుమార్‌, సోమలింగం, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.